


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కృష్ణా జిల్లా వార్తలు

గురువారం 16 జనవరి 2025



కోటాల్లాట..!

ఉమ్మడి కృష్ణాలో రూ.400 కోట్లకు కోడి పందేలు

పండుగ మూడు రోజులూ పందెంకోళ్లదే హవా

జిల్లా అంతటా భారీగా వెలిసిన బరులు ● పేకాట, గుండాటకు కూడా ప్రాధాన్యం

- అంపాపురం హైటెక్ బరిలో కాసులే కాసులు
- కిక్కిరిసిన బరులు.. పట్టని పోలీస్ ఆంక్షలు
- రాత్రి సమయాల్లోనూ జోరుగా జూదం
- చాలాచోట్ల ఇరువర్గాల ఘర్షణ, దాడులు
- యథేచ్ఛగా మద్యం విక్రయాలు
- గత ఏడాదితో పోలిస్తే కాస్త తక్కువే..





ఎనికేపాడు బరిలో ఆసక్తికరంగా సాగుతున్న కోడిపందేలు (ఇన్‌సెట్‌లో) గుడ్లవల్లేరు బరిలో పందేలు వేస్తున్న మహిళలు



కోళ్లు కాళ్లు దువ్వాయ్.. నోట్లు 'కట్టలు' తెంచుకున్నాయ్.. రూ.కోట్లు పైకెగిరాయ్.. సంబరాల సంక్రాంతి మూడు రోజులూ పందెంకోళ్లే హవా సాగించాయ్. మూడుముక్కలాటలు ముచ్చటగా జరిగాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని చాలాప్రాంతాల్లో పండుగ మూడురోజులు కలిపి రూ.400 కోట్లకు పైగా కోడిపందేలు, ఇతరత్రా జూదాలు నిర్వహించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి పందేలు కాస్త తక్కువగానే జరిగినప్పటికీ ఈసారి హైటెక్ బరులు ఆకట్టుకున్నాయి. సాయంత్రం 5 గంటలకు బరులను నిలిపివేయాలని పోలీసులు ఆంక్షలు విధించినా.. ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. చాలాచోట్ల ఇరువర్గాలు ఘర్షణలకు దిగగా, మందుబాబులు రూ.30 కోట్ల మద్యాన్ని తాగేశారు.



కపిలేశ్వరపురం బరిలో కోడిపుంజులతో పందెపురాయుళ్లు సిద్ధం



నందివాడ మండలం గండేపూడి బరిలో తోపులాట



రామవరప్పాడు బరి వద్ద కోలాహలం

మూడు రోజులు రూ.30 కోట్ల మద్యం

మూడు రోజులపాటు మందుబాబులు మొత్తం రూ.30 కోట్ల మద్యాన్ని తాగేశారు. ఉమ్మడి జిల్లాలో మద్యం వ్యాపారులు ఈనెల 11వ తేదీన డిపోల నుంచి రూ.8.46 కోట్లు, 12న రూ.7.41 కోట్లు, 13న రూ.16.59 కోట్ల సరుకును షాపులకు తరలించారు. 14వ తేదీ మధ్యాహ్నం వరకు రూ.4.50 కోట్ల విలువైన మద్యం కొన్నారు. కనుమ రోజున సెలవు కావడంతో మూడు రోజులకు సరిపడా 14వ తేదీ సాయంత్రానికే సమకూర్చుకున్నారు.

ఆంధ్రజ్యోతి మచిలీపట్నం/విజయవాడ : బాపులపాడు మండలంలోని అంపాపురంలో హైటెక్ హంగులతో కోడిపందేలు, పేకాట శిబిరాలు మూడు రోజుల పాటు జరిగాయి. ఒక్కో పందెం రూ.3 లక్షలకు తక్కువకాకుండా వేశారు. పెద్దబరుల్లో ఒక్కో కోడిపందెం రూ.10 లక్షలకు తక్కువ కాకుండా నిర్వహించారు. అంపాపురంలో ఏర్పాటుచేసిన శిబిరానికి తెలంగాణ నుంచి అధికంగా తరలివచ్చారు. దీంతో విజయవాడ-ఏలూరు జాతీయ రహదారిపై కార్లు బారులు తీరి కనిపించాయి. కాగా, చాలామంది ఈసారి భీమవరం వైపు వెళ్లారు. దీంతో ఏటా రూ.30 కోట్ల వరకూ జరిగే పందేలు ఈసారి రూ.20 కోట్లకే పరిమితమయ్యాయి. గుండాట శిబిరాల వద్ద మహిళలు అధిక సంఖ్యలో పందేలు కాశారు. నగదు రూపంలో కాకుండా టోకెన్లు అందించి మరీ పందెపురాయుళ్లను అనుమతించారు. బుధవారం వరుసగా ఐదు పందేలు గెలిచిన బాబీకి నిర్వాహకులు బుల్లెట్‌ను బహుమతిగా అందజేశారు. రామవరప్పాడు, ఎనికేపాడు గ్రామాల్లో భారీగా బరులు ఏర్పాటు చేశారు.

● గుడివాడ నియోజకవర్గంలో మూడు రోజులుగా కోడి పందేలు, పేకాట శిబిరాలు జరిగాయి. గుడివాడలోని గౌతమ్ స్కూల్ వెనుక, బొమ్ములూరులో, నందివాడ మండలం నందివాడ, పుట్టగుంట, పోలుకొండ, రుద్రపాక శివారు గొల్లగూడెం, తమిరిశలో కోడి పందేలు, పేకాట నిర్వహించారు. గుడ్లవల్లేరు మండలంలో ఏర్పాటుచేసిన పందేల వద్దకు మహిళలు అధికంగా వచ్చారు. గుండాటల్లో పాల్గొని పందేలు కాశారు. గుడ్లవల్లేరు, కౌతవరం, డోకిపర్రు, కూరాడ, కుచ్చికాయలపూడి బరుల్లో రూ.కోట్లు చేతులు మారాయి. నందివాడ మండలం గండేపూడి బరిలో ఇరువర్గాలు దాడులు చేసుకున్నాయి.

● మచిలీపట్నంలోని రుద్రవరం బరిలో కోడి పందేలు సక్రమంగా నిర్వహించడం లేదని పోలాటితిప్ప గ్రామానికి చెందినవారు ప్రశ్నించారు. ఇరువర్గాలు కొట్లాడుకున్నా పోలీసులు కన్నెత్తి చూడలేదు. మేకావానిపాలెం, శ్రీనివాసనగర్, గోకవరం బరుల వద్ద పెద్ద ఎత్తున పేకాట శిబిరాలు నిర్వహించారు. పేకాట కోసం ప్రత్యేకంగా గదులు ఏర్పాటుచేసి రూ.5 వేలు, రూ.10 వేల చొప్పున టోకెన్లు మిగతా 6లో..



చిల్లపల్లి బరిలో గెలిచిన బాబీకి బుల్లెట్ బహుమతి



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ బాలశౌరి

సాగు, తాగునీటి అవసరాలు తీర్చండి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎంపీ బాలశౌరి విజ్ఞప్తి

మచిలీపట్నం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా సాగు, తాగునీటి అవసరాలు తీర్చాలని ఎంపీ వల్లభనేని బాలశౌరి.. ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. సీఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మర్యాదపూర్వకంగా సీఎంను కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఎంపీ పలు విజ్ఞప్తులు చేశారు. జల్‌జీవన్ మిషన్ పథకం కింద కృష్ణాజిల్లాను యూనిట్‌గా పరిగణించి, ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటిని అందించేందుకు సహకరించాలని కోరారు. తద్వారా పంచాయతీలపై ఆర్థికభారం పడదని చెప్పారు. కృష్ణాడెల్టాలోని ప్రజలకు సాగు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రకాశం బ్యారేజీ దిగువన పెనమలూరు మండలం చోడవరం, మోపిదేవి మండలం బండికోళ్లంక వద్ద కృష్ణానదిపై రెండు బ్యారేజీలను నిర్మించి నీటిని నిల్వ ఉంచేందుకు డీపీఆర్ రూపొందించారని కోరారు. నాబార్డు నిధుల ద్వారా నాగాయలంక మండలంలో ఎదురుమొండి-ఏటిమొగల మధ్య కృష్ణానదిపై వారధి నిర్మాణం, కంకిపాడులోని మంతెన వద్ద బుడమేరుపై వంతెన నిర్మాణం, పెదపారుపూడి-పామర్రు మండలాలను కలుపుతూ యలమర్రు వద్ద పుల్లేరు కాల్వపై వంతెన, గూడూరు-కంకటావ గ్రామాల మధ్య పంటకాల్వపై వంతెన నిర్మించే ప్రతిపాదనలు ఉన్నాయని, వాటికి అనుమతులు ఇచ్చి నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సాధ్యమైనంత త్వరగా ఈ పనులకు ఆమోదం తెలుపుతామని సీఎం హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.

మంగళగిరి ఎయిమ్స్ సభ్యులుగా మచిలీపట్నం, విజయవాడ ఎంపీలు

మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) సభ్యులుగా మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనాథ్‌ను నియమిస్తూ కేంద్రప్రభుత్వ కుటుంబ సంక్షేమశాఖ ఈనెల 13న ఉత్తర్వులు జారీచేసింది. వీరు ఈ ఆసుపత్రి అభివృద్ధిపై తరచూ సమీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందించడంతో పాటు ఆసుపత్రి అభివృద్ధి కోసం కృషి చేయాల్సి ఉంది.

డీఆర్‌డీఏ పీడీ ఎవరు..?

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)లో పాలన గాడి తప్పుతోంది. ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) పోస్టు ఇన్‌చార్జిల పాలనలో సాగుతుండటం, రెగ్యులర్ అధికారిని నియమించకపోవడంతో పట్టించుకునేవారు కరువయ్యారు. ఇన్‌చార్జి అధికారులేమో.. సిబ్బంది జీతభత్యాల బిల్లులపై సంతకాలు చేసి, మిగిలిన పనులన్నింటినీ పక్కన పెట్టేస్తున్నారు. దీంతో నెలవారీ సమీక్షలు నిర్వహించడమే మానేయగా, డ్వాక్రా సమస్యలు, ఏపీఎంల అక్రమాలను అడిగే వారు లేకుండాపోయారు.

ముఖ్యమైన లావాదేవీలు చూసేవారు కరువు

పర్యవేక్షించే అధికారి లేక ఏపీఎంల ఇష్టారాజ్యం

పదినెలలుగా ఇన్‌చార్జి అధికారుల పాలనలోనే..

నెలవారీ సమీక్షలకు కూడా గుండుసున్నా ● డ్వాక్రా సమస్యలు, నెలవారీ సమీక్షలు లేనేలేవు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో 29,500 డ్వాక్రా సంఘాలుండగా, వాటిలో 3.10 లక్షల మంది సభ్యులున్నారు. తాడంకి పురపాలక సంఘంలో ఇటీవలే 500కుపైగా డ్వాక్రా సంఘాలను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) నుంచి మినహాయించి మెప్మాలో విలీనం చేశారు. పదినెలల క్రితం వరకు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ)గా పీఎస్ఆర్ ప్రసాద్ పనిచేశారు. ఆయన పదవీ విరమణ నుంచి ఇన్‌చార్జి పీడీల పాలన సాగుతోంది. ఎన్నికల సమయంలో అప్పటి డీపీవో నాగేశ్వరనాయక్ ఇన్‌చార్జి పీడీగా పనిచేశారు. ఆ తరువాత ఆయన బదిలీ అయ్యారు. డీపీవోగా వచ్చిన జె.అరుణకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇటీవల ఆమె సెలవు పెట్టడంతో జెడ్పీ సీఈవోకు ఆ బాధ్యతలు ఇచ్చారు. డీపీవో అరుణ మళ్లీ విధుల్లోకి రావడంతో ఆమెను తిరిగి డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా కలెక్టర్ నియమించారు. దీంతో ఈ పోస్టులో ఎవరు, ఎంతకాలం పాటు పనిచేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

కొరవడిన పర్యవేక్షణ

డీఆర్‌డీఏ ద్వారా జిల్లాలోని డ్వాక్రా సంఘాలకు ఏడాదికి కనీసం రూ.వెయ్యి కోట్ల రుణాలివ్వాలి. డ్వాక్రా రుణాలకు సున్నావడ్డీ వర్తింపజేయడం, జిల్లా, మండల సమాఖ్యల పనితీరుపై నెలవారీ సమీక్షా సమావేశాలు నిర్వహించడం, స్త్రీనిధి రుణాలు అందజేయడం, డ్వాక్రా సంఘాల రికార్డుల నిర్వహణ, బీమా, పనితీరు బాగోని ఆయా డ్వాక్రా సంఘాలను గాడిలో పెట్టేందుకు నెలవారీ సమీక్షలు నిర్వహించడం వంటి పనులను డీఆర్‌డీఏ పీడీ నిత్యం చేస్తూ ఉండాలి. డ్వాక్రా రుణాలు మంజూరు చేయడంలో ఏమైనా బ్యాంకులు జాప్యం చేస్తే డీఆర్‌డీఏ పీడీ సదరు బ్యాంకు అధికారులతో మాట్లాడి పరిస్థితులను చక్కదిద్దాలి. పదినెలలుగా రెగ్యులర్ పీడీ లేకపోవడంతో ఈ సమీక్షలు జరగడం లేదు.

ఏపీఎంల అక్రమాలు

మండలస్థాయిలో పనిచేసే ఏపీఎంలు అక్రమాలకు పాల్పడుతున్నా పట్టించుకునేవారే లేకుండాపోయారు. పరిపాలనాపరమైన సౌలభ్యం కోసం కంకిపాడు, గుడివాడ, పెడన, చల్లపల్లి, అవనిగడ్డ క్లస్టర్లు ఉన్నాయి. వీటిలో పనిచేసే డీపీఎంలు, ఏపీఎంలు ఎవరు ఏం చేస్తున్నారనే అంశంపై పర్యవేక్షణ కొరవడింది. చల్లపల్లి క్లస్టర్ పరిధిలోని మండలాల్లో ఉన్న డ్వాక్రా సంఘాలకు సంబంధించి అనేక అవినీతి ఆరోపణలున్నాయి. పోలాటితిప్ప, కానూరు, నాగాయలంక తదితర మండలాల్లో మండల సమాఖ్యలు లేదా కొన్ని డ్వాక్రా సంఘాల్లో రూ.40 లక్షల నుంచి రూ.1.50 కోట్ల వరకు నగదు మాయమైన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. వీటిపై విచారణ చేయాలని డ్వాక్రా సంఘాల సభ్యులు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకునేవారే కరువయ్యారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో హెచ్ఆర్ విభాగం మేనేజర్, చల్లపల్లి క్లస్టర్ డీపీఎంగా ఒకరే పనిచేస్తున్నారు. చల్లపల్లి క్లస్టర్ పరిధిలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నా విచారణ చేయకుండానే కాలం వెళ్లదీస్తున్నారు.



మచిలీపట్నంలోని డీఆర్‌డీఏ కార్యాలయం

డీపీఎం, ఏపీఎంలకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా..

గత ఏడాది అక్టోబరులో డీఆర్‌డీఏలో ఉద్యోగుల బదిలీలు జరిగాయి. అప్పట్లో బదిలీపై జిల్లాకు వచ్చిన డీపీఎంలు, ఏపీఎంలలో కొందరికి ఇంకా క్లస్టర్లు, మండలాలు కేటాయించకుండా ఖాళీగా ఉంచేశారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో వీరు ఎలాంటి పనిలేకుండా కాలక్షేపం చేస్తున్నారు. మూడు నెలలుగా వీరికి జీతాలు చెల్లిస్తున్నా, ఎలాంటి విధులను అప్పగించక పోవడం గమనార్హం. ఇన్‌చార్జి పీడీలుగా ఎవరు పనిచేసినా ఈ ఉద్యోగులకు పోస్టింగ్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు.

డీఆర్‌డీఏ పీడీ కారు తెలంగాణాలో..

డీఆర్‌డీఏ పీడీకి ప్రభుత్వం స్కార్పియో కారును కేటాయించింది. ఇటీవల ఈ కారు జిల్లాలో కంటే తెలంగాణాలోనే అధికంగా ఉంటోంది. కారు.. జిల్లా సరిహద్దులు దాటి వెళ్లకూడదు. అయినా తెలంగాణాలోనే ఉంటోందని ఉద్యోగులే చెబుతున్నారు.

జోసఫ్ తంబి ధన్యజీవి

- బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు
- ముగిసిన జోసఫ్ తంబి తిరునాళ్లు

6లో

పాములకాల్వ బరి వద్ద ఉద్రిక్తత

రెండు వర్గాల మధ్య ఘర్షణ

- ఎస్ఐపై తిరగబడిన జక్కంపూడి వాసులు
- వత్తాసు పలికిన యూట్యూబర్స్

విజయవాడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : అంబాపురంలోని పాములకాల్వ వద్ద ఏర్పాటుచేసిన కోడిపందేల బరుల వద్ద బుధవారం రాత్రి ఉద్రిక్తత ఏర్పడింది. జక్కంపూడికి చెందిన కొంతమందితో పాటు కొందరు యూట్యూబర్లు.. పోలీసు అధికారిపై తిరగబడటంతో గొడవ మరింత పెద్దదైంది. వివరాల్లోకి వెళితే.. పాములకాల్వ వద్ద బరి వద్దకు బుధవారం రాత్రి జక్కంపూడి గ్రామానికి చెందిన కొంతమంది వచ్చి గొడవ చేశారు. బైక్ పార్కింగ్ విషయంలో వివాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. నిర్వాహకులకు, జక్కంపూడికి చెందిన వ్యక్తులకు గొడవై ఒకరినొకరు తోసుకోవడంతో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న కొత్తపేట ఎస్ఐ హరిప్రసాద్ లాఠీకి పనిచెప్పారు. దీంతో జక్కంపూడికి చెందిన వ్యక్తులు ఆయనపై తిరగబడ్డారు. ఆయన్ను తోసే ప్రయత్నం చేశారు. ఎస్ఐపై తిరగబడిన వారికి కొంతమంది యూట్యూబర్లు కూడా వత్తాసు పలికారు. కాగా, ఎస్ఐపై తిరగబడిన విషయాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు.

తూర్పు బైపాస్‌పై సందిగ్ధం

ఎంపీ బాలశౌరికి విజ్ఞప్తుల వెల్లువ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ తూర్పు బైపాస్ రోడ్డు ప్రాజెక్టుపై అంతర్మథనం నెలకొంటోంది. కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ (మోర్తు) ఈ ప్రాజెక్టు అవసరం లేదని చెప్పటంతో అనిశ్చితి నెలకొన్న సంగతి తెలిసిందే. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుకు, తూర్పు బైపాస్‌కు లింకు పెట్టడం కూడా ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజల్లో అసంతృప్తిని రగిల్చింది. ఈ విషయం మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి వరకు చేరింది. ఆయనకు ప్రజల నుంచి విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పట్టుబడితే తప్ప ఈ ప్రాజెక్టు సాకారమయ్యే పరిస్థితి లేదు. దీంతో ఎంపీ వల్లభనేని బాలశౌరి ఈ అంశాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి.. ఆయన ద్వారా అధిష్ఠానానికి విన్నవించుకోవాలని చూస్తున్నారు.


రామవరప్పాడు బరి వద్ద ఉద్రిక్త వాతావరణం


ఎనికేపాడు బరిలో జోరుగా గుండాట


బరుల వద్ద భారీగా వాహనాలు

బరిలో.. కోఢీ!

ప్రేక్షకుల్లా.. పోలీసులు!

- భారీగా కోడి పందేలు, జూదాలు
- కోట్లలో చేతులుమారిన నగదు







కంచికచర్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : నందిగామ డివిజన్ పరిధిలో సంక్రాంతి మూడు రోజులు భారీగా కోడి పందేలు క్యాసినో తరహాలో జూదాలు జరిగాయి. రూ.కోట్లలో నగదు చేతులు మారింది. ఇంతకు ముందెన్నడూ ఈ స్థాయిలో పందేలు జరగలేదు. జాతీయ రహదారి పక్కన బరులు ఏర్పాటు చేసి కోడి పందేలు నిర్వహించారు. నందిగామ నుంచి రాష్ట్ర సరిహద్దు గరికపాడు వరకు జాతీయ రహదారి పక్కన పదికి పైగా బరులు ఏర్పాటు చేశారు. పెనుగంచిప్రోలు, గరికపాడు, కంచికచర్ల మండలం గండేపల్లి, చందర్లపాడు, షేర్‌మహ్మద్‌పేట తదితర ప్రాంతాల్లో ప్రత్యేకంగా టెంట్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి రేయింబవళ్లు క్యాసినో తరహాలో జూదం నిర్వహించారు. ఎక్కడికక్కడ నేతల కనుసన్నల్లో పేకాట, గుండాట ఇతర జూదాలు జరిగాయి. జూదరులకు ప్రత్యేక వసతి సదుపాయాలతో పాటు మందు, మాంసాహార భోజనాలు ఏర్పాటు చేశారు. పందేలకు మాట్‌లు, టేబుళ్లతో సహా అన్ని రకాల ఏర్పాట్లకు నిర్వాహకులు రూ. 20 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు ఖర్చు చేశారంటే జూదం ఏస్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. రూ.కోట్లలో నగదు చేతులు మారింది.

డ్రోన్లతో పర్యవేక్షిస్తున్నాం.. బరులు తొలగించాం.. నిర్వాహకులకు నోటీసులిచ్చాం.. జూదం, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు చేసిన హెచ్చరికలు ఎప్పటిలానే ప్రకటనలకే పరిమితమయ్యాయి. మూడురోజులు పోలీసులు పందేల జోలికి రాలేదు. కొందరు అధికారులు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేశారు. గతానికి భిన్నంగా పెద్దఎత్తున కోడిపందేలు, జూదం జరిగాయి. పలు శిబిరాల్లో బుధవారం రాత్రి కూడా జూదం నడిచింది.

కాసులు కురిపించిన సంబరాలు

మూడురోజుల పాటు పేటలో జనం జాతర
తెలంగాణా నుంచి భారీగా పందెంరాయుళ్లు

జగ్గయ్యపేట : సంక్రాంతి సంబరాలు కూటమి నేతలకు కాసులు కురిపించాయి. ఎక్కడికక్కడ బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి భారీగా కోడిపందేలు, జూదం నిర్వహించి కాసులు దండుకున్నారు. పండుగ ముందు రోజువరకు బరులను ధ్వంసం చేసిన పోలీసులు తర్వాత ఆవైపే చూడలేదు. జగ్గయ్యపేట నియోజకవర్గం ఆంధ్రా, తెలంగాణా ప్రాంతం సరిహద్దుగా ఉండటంతో జనం జాతరలా తరలివచ్చారు. గరికపాడు, బూదవాడ, జాతీయరహదారిపై తిరుమలగిరి వద్ద, వత్సవాయి, లింగాల, మంగోల్లు ప్రాంతాల్లో బరులు ఏర్పాటు చేశారు. పంచాయతీ సర్పంచ్‌లు, అధికార పార్టీ నేతలు బరుల నిర్వాహకులకు అన్ని రకాలుగా సహకరించారు. పోలీసులు సివిల్‌లో ఉండి ఎక్కడికక్కడ నిర్వాహకులకు ఇబ్బందులు కలగకుండా, ఘర్షణలు జరగకుండా పర్యవేక్షించటం విశేషం. లోపాయి కారీ ఒప్పందాలతో బరులు అధికార పార్టీ నేతలకు సిరులు కురిపించాయి.

తిరునాళ్లను తలపించిన 'అంపాపురం'

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : రాష్ట్రంలోనే పెద్దబరిగా గుర్తింపు పొందిన అంపాపురం కోడిపందేలు, జూదం చూడటానికి, ఆడటానికి వచ్చే వారితో తిరునాళ్లను తలపించింది. బాపులపాడు మండలం బిళ్లనపల్లి, వేలేరు, సింగన్నగూడెం, తిప్పనగుంట తదితర గ్రామాల్లో మూడురోజుల పాటు కోడిపందేలను నిర్వహించారు. కోడిపందేల్లో కోట్లాది రూపాయల నగదు చేతులు మారింది. మందుబాబుల కోసం ప్రత్యేక కౌంటర్లతో పాటు అక్కడే కూర్చుని సేవించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. అంపాపురం బరిలో లక్షల్లో నిర్వహించిన కోడిపందేలు, జూదంలో కోట్లాది రూపాయలు చేతులు మారాయి. పోలీసులు ఎక్కడా కానరాకపోవడంతో గ్రామాల్లో బరుల్లోనూ నోట్ల వరద పారింది. జాతీయ రహదారి పక్కన సర్వీస్ రహదారి కార్లతో నిండిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బిళ్లనపల్లి శివారులోని బరిలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ పడేయడంతో ఎండిపోయిఉన్న ఆయిల్‌పామ్ మట్టలు అంటుకుని మంటలు చెలరేగాయి. పందెపురాయుళ్లు కోళ్లతో పరుగులుపెట్టారు. పొగ కమ్మేయడంతో నిర్వాహకులు నీటి ట్యాంకర్లతో మంటలను అదుపుచేశారు.



కోస మాంసానికి భలే గిరాకీ

పందెంలో కత్తులు కట్టుకుని ప్రత్యర్థితో హోరాహోరీగా పోరాడిన కోడి పుంజులు విజయంతో తమ యజమానికి ఆదాయాన్ని తెచ్చిపెడతాయి. ఆదే కోడి ఓడినా ధర రూ.వేలల్లో ఉంటుంది. పందెంలో ఓడి చనిపోయిన పుంజు మాంసాన్ని 'కోస' అంటారు. సంక్రాంతి మూడు రోజుల్లో ఒక్కసారైనా కోస మాంసం రుచిచూడాలని పందెపురాయుళ్లతో పాటు అధికారులు, అనధికారులు ఎదురుచూస్తుంటారు. జీడిపప్పు, బాదం, పిస్తా వంటి బలవర్ధకమైన ఆహారంతో పాటు రోజూ వ్యాయామం చేయించడంతో 'కోస' మాంసానికి అంతటి గిరాకీ ఏర్పడిందని పందెపురాయుడు అంటున్నారు. కోస మాంసం కిలో రూ. 5వేలకు పైగా ధర పలికింది. అయినా కోస అందట్లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పందెం కోడి బతికినా, చచ్చినా ఆదాయమె అంటున్నారు పెంపకం దారులు.

మామిడి తోటల్లో పందేల కోలాహలం

తిరువూరు : సంక్రాంతి సాంప్రదాయం ముసుగులో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో భారీస్థాయిలో కోడిపందేలు, కోసు, గుండాట జూదాలు జోరుగాసాగాయి. మామిడి తోటల్లో మూడురోజులుగా భారీ స్థాయిలో కోసా నిర్వహించారు. కోడిపందేల బరులతో పాటు పేకాట శిబిరాలవద్ద రూ.లక్షల్లో చేతులు మారాయి. తిరువూరు, విస్సన్నపేట, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లో శిబిరాల వద్దకు దూరప్రాంతాలకు చెందిన పందెంరాయుళ్ల వసతి ఏర్పాటు చేసుకొని మరి పందేల్లో పాల్గొన్నారు. కొన్నిచోట్ల రాత్రి సమయాల్లో ఫ్లడ్‌లైట్ల వెలుగులో పందేలు నిరాటంకంగా సాగాయి. తెలంగాణతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు తరలిరావడంతో పందేలు లక్షల్లోకి చేరుకున్నాయి. మద్యం, గుట్కాలు అధిక ధరకు విక్రయించారు. కోడిపందేల్లో జేబు దొంగలు రెచ్చిపోయారు. నగదుతో పాటు, సెల్‌ఫోన్లు అపహరణకు గురయ్యాయి.

పామర్రు : పామర్రు పరిధిలో కోడి పందేలు, పేకాట, ఇతర జూదలు యథేచ్ఛగా సాగాయి. గుడివాడ రోడ్డులోని కొత్తూరులో ఏర్పాటు చేసిన ప్రత్యేక బరుల్లో జూదాలు నిర్వహించారు. భారీస్థాయిలో నగదు చేతులు మారింది. విచ్చలవిడిగా మద్యం, గుట్కాల విక్రయాలు జరిగాయి. అధికార పార్టీ నేతలకు పందేల రూపంలో కాసులు కురిపించాయి. ఎక్కడికక్కడ ఆహార పదార్థాల ధరల మోత మోగింది.


సమష్టి దివ్యబలిపూజ సమర్పిస్తున్న బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు

బ్రదర్ జోసఫ్ తంబి ధన్యజీవి

- బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు

- ఘనంగా ముగిసిన జోసఫ్ తంబి తిరునాళ్లు

ఉంగుటూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా, ఉంగుటూరుమండలం, పెదఅవుటపల్లిలోని ప్రసిద్ధ కతోలికా పుణ్యక్షేత్రంలో మూడురోజులుగా అత్యంత వైభవంగా జరుగుతున్న బ్రదర్ జోసఫ్ తంబి తిరునాళ్ల మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజు ఉత్సవాలకు విజయవాడ మేత్రాసనం పీఠాధిపతులు(బిషప్)తెలగతోటి జోసఫ్ రాజారావు ప్రధాన గురువులుగా హాజరయ్యారు. తొలుత తంబి సమాధిని దర్శించి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సమిష్టి దివ్యపూజాబలిని సమర్పించి, భక్తులకు దివ్యసందేశాన్ని అందించారు. బ్రదర్ జోసఫ్ తంబి ధన్యజీవి అని, ఆయన జీవించి వుండగా ఎన్నో అద్భుతాలు చేశారని, కుల, మత భేదాలు లేకుండా అందరిని సమంగా ఆదరించి, ప్రేమించారని, అందుకే నేడు ఆయనను అందరూ ఒక పునీతునిగా ఆదరిస్తున్నారని కొనియాడారు. అనంతరం అర్థరాత్రివరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి. ఈకార్యక్రమంలో పలువురు గురువులు, ఉపదేశులు, గుడిపెద్దలు, సంఘపెద్దలు, మరియదళసభ్యులు, కన్యాస్త్రీలు, యూత్, సంఘస్థులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

19న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాక

- ఎన్ఐడీఎం, ఎన్డీఆర్ఎఫ్ కేంద్రాల సందర్శన
- ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

గన్నవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈ నెల 19న గన్నవరం రానున్నారు. ఈ సందర్భంగా కొండపావులూరులో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్మెంట్, 10వ బెటాలియన్ ఎన్డీఆర్ఎఫ్ క్యాంప్ ప్రారంభోత్సవం సందర్భంగా కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు, ఎన్డీఆర్ఎఫ్ ఉన్నతాధికారులతో కలసి బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. అమిత్‌షా పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొనే అవకాశం ఉందని ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలన్నారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి వెన్యూ వద్ద ఇనాఛార్జ్‌లను నియమించాలన్నారు. ఎన్ఐడీఎం క్యాంపస్ ఇన్‌చార్జి కల్నల్ పీఎస్ రెడ్డి, ఎన్డీఆర్ఎఫ్ క్యాంపస్ ఇన్‌చార్జ్ కమాండెంట్ వీవీఎన్ ప్రసన్నకుమార్, గుడివాడ ఉయ్యూరు ఆర్డీవోలు బాలసుబ్రమణ్యం, హేలా షారోన్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.శర్మిష్ట, డ్వామా పీడీ ఎస్వీ శివప్రసాద్, తహసీల్దారు కేవీ శివయ్య, జిల్లా ఫైర్ అధికారి ఏసు రత్నం సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన పూటీలాగుడు పోటీలు

- విజేత నెల్లూరు ఎడ్ల జత, రెండు, మూడు స్థానాల్లో గుంటూరు, కృష్ణా

ఘంటసాల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబరాల్లో భాగంగా డాక్టర్ గొర్రెపాటి నవనీత కృష్ణ మెమోరియల్ ఆధ్వర్యంలో ఘంటసాల జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల పూటీలాగుడు పోటీలు మంగళవారంతో ముగిశాయి. న్యూ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో రెండు రోజులపాటు జరిగిన పోటీలు ఆద్యంతం ఉల్లాసంగా సాగాయి. న్యూ జూనియర్స్ విభాగంలో 13 ఎడ్ల జతలు, జూనియర్స్ అండ్ సీనియర్స్ విభాగంలో 11 జతలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. పోటీలను తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పశుపోషకులు తరలిరావటంతో సందడి నెలకొంది. హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి పోటీల నిర్వాహకులను అభినందించారు. పూటీ బండికి టీడీపీ జెండాలు కట్టి నిర్వహించిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.




పూటీలాగుతున్న సీనియర్ ఎడ్ల జత, ప్రథమ విజేతకు బహుమతి అందజేస్తున్న హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి

నెల్లూరు ఎడ్ల జతకు ప్రథమ స్థానం

జూనియర్ అండ్ సీనియర్స్ విభాగంలో నెల్లూరు జిల్లా ఆలూరు మండలం తూర్పుగోగులపల్లికి చెందిన పల్లిబోయిన సంతోష్ రెడ్డి ఎడ్ల జత 2824.9 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పత్తిపాడు గ్రామానికి చెందిన పమిడి అంజయ్య చౌదరి ఎడ్ల జత 2783.9 అడుగుల దూరం లాగి రెండో స్థానంలోనూ, కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం నాదెళ్లవారిపాలేనికి చెందిన కాకర్ల సురేష్‌బాబు ఎడ్ల జాత 2700 అడుగుల దూరం లాగి మూడో స్థానం కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా చిన్నగంజాం మండలం ఆవుల దొడ్డి గొల్లపాలెం గ్రామానికి చెందిన గోగినేని కార్తీక్ ఎడ్ల జత 2636.7 అడుగుల దూరం లాగి నాల్గవ స్థానాన్ని, బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం పగడంవారిపాలెంకు చెందిన కుంచెల వేదశ్రీలతారెడ్డి ఎడ్ల జాత 2593.7 అడుగుల దూరం లాగి ఐదో స్థానాన్ని, కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం చిన్నపులిపాక గ్రామానికి చెందిన ఆర్‌వీఎస్ బుల్స్ ఎడ్ల జత 2439.2 అడుగుల దూరం లాగి ఆరో స్థానాన్ని, ఆర్‌వీఎస్ బుల్స్ మరో ఎడ్ల జత 2277.4 అడుగుల దూరం లాగి స్పెషల్ ప్రైజ్‌ను కైవసం చేసుకున్నాయి. విజేతలైన ఎడ్ల జత యజమానులకు రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులను హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి చేతులమీదుగా అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా సూరపనేని రాధాకృష్ణ ప్రసాద్ వ్యవహరించారు. ఒంగోలు జాతి వృషభ రాజముల పూటీ లాగుడు ప్రదర్శన కమిటీ వారి పర్యవేక్షణలో జరిగాయి.

ఉత్కంఠగా పొట్టేలు పందేలు..

నందిగామ/చందర్లపాడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. చందర్లపాడు గ్రామంలో సంక్రాంతి సాంప్రదాయలను ప్రతిబింబించేలా పొటేలు పందేలు నిర్వహించారు. పొటేలు కాపరులు పొట్టేళ్లను సుందరంగా అలంకరించి పోటీలకు తెచ్చారు. పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి కోమటి అజేష్ పొట్టేలు, ద్వితీయ బహుమతి అండాల అవినాష్, తృతీయ బహుమతి దెందుకూరుకు చెందిన అంకమ్మతల్లి, మహ లక్ష్మమ్మతల్లి పొట్టేలు, నాలుగో బహుమతి ఆవల వెంకటాద్రి పొట్టేల్లు సాధించాయి. విజేతలకు ఎన్ఎస్‌పి ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మేకల సుధాకర్‌బాబు, ఉన్నం నరసింహారావు, దాసరి ఏసుప్రభు, దుద్దుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


విజేతకు బహుమతి అందజేస్తున్న కోట వీరబాబు


బరిలో పోట్లాడుతున్న పొట్టేళ్లు

కోట్లాట..!

(5వ పేజీ తరువాయి)

అందించారు. బౌన్సర్లను ఏర్పాటుచేసి, టోకెన్లు ఉన్నవారినే లోపలికి పంపారు. అక్కడే మద్యం విక్రయాలు జరిపారు. మచిలీపట్నంలో ఏర్పాటుచేసిన బరులను సాయంత్రం 5 గంటలకు మూసివేయాలని పోలీసులు చెప్పినా, నిర్వహకులు వినిపించుకోలేదు. రాత్రి సమయంలోనూ కొనసాగించారు.

- పెడన నియోజకవర్గంలో తోటమూల, కొంకేపూడి, బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి, అర్తమూరులో కోడి పందేలు భారీగా జరిగాయి. బంటుమిల్లి, పెందుర్రు, నాగేశ్వరరావుపేట, తుమ్మిడి తదిత ర ప్రాంతాల్లో పేకాట శిబిరాలను మూడు రోజులు రాత్రిపూట కొనసాగించారు. గూడూరు మండలంలోని గూడూరు-పెడన రహదారి వెంబడి, పోసినవారిపాలెంలలో బరులు ఏర్పాటుచేసి పందేలు వేశారు. పేకాట కూడా జరిగింది.
- అవనిగడ్డ నియోజవర్గంలోని పులిగడ్డ, పులిగడ్డపల్లెపాలెం, అవనిగడ్డ, పాతఎడ్లంక, గొట్టంమిల్లుల వద్ద కోడి పందేలు, పేకాట శిబిరాలు నిర్వహించారు. నాగాయలంక, చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల, కోడూరు మండలాల్లో కోడి పందేలు, పేకాట, గుండాట నిర్వహించారు.
- పామర్రు నియోజకవర్గం కొత్తపెదమద్దాలి, పెదపారుపూడి మండలం యలమర్రు, పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం, హనుమంతపురం, మొవ్వ మండలం కోసూరు, కూచిపూడి, భట్లపెనుమర్రు, తోట్లవల్లూరు మండలం గరికపర్రు, కొమ్మమూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరులో కోడి పందే మూడు రోజులు జోరుగా కొనసాగాయి.

దుర్గమ్మ సేవలో సీఎం ముఖ్య కార్యదర్శి రవిచంద్ర

వన్‌టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : కనక దుర్గమ్మను ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈవో కె.రామచంద్ర మోహన్ వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని దేవస్థానంలో బుధవారం శాస్త్రోక్తంగా గోశాలలో గోమాతకు పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకస్వాముల మంత్రోచ్ఛరణల నడుమ వస్త్రం, పూలు, పసుపు, కుంకుమ తదితరాలు గోమాతకు సమర్పించి పూజలు నిర్వహించారు.


రవిచంద్ర దంపతులకు ప్రసాదం అందజేస్తున్న ఈవో రామచంద్ర మోహన్

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

ఉంగుటూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మండలంలోని ఆత్కూరు, ఉంగుటూరు స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో పేకాట, కోడిపందేల శిబిరాలపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఆత్కూరు పరిధిలోని చినఅవుటపల్లి, తెంపల్లి గ్రామాల్లో కోడిపందేలు, పేకాట స్థావరాలపై ఎస్సై చావా సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి 39మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.10,350ల నగదు, 12 కోళ్లను స్వాధీనం చేసుకుని 9 కేసులు నమోదుచేసినట్టు తెలిపారు. మద్యం మత్తులో యువకుల మధ్య జరిగిన ఘర్షణ పరస్పరదాడులకు దారితీసింది. దాడుల్లో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తునట్లు ఉంగుటూరు ఎస్ఐ యు.గోవిందు తెలిపారు.


మీడియాతో మాట్లాడుతున్న ముస్లిం మత పెద్దలు

మసీదులో వస్తువులు ధ్వంసం చేసిన దుండగులు

- బాధ్యులను శిక్షించండి : మత పెద్దలు

మచిలీపట్నం టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పంబలగూడెంలోని బిలాల్ మసీదులో మంగళవారం అర్థరాత్రి కొందరు దుండగులు మసీదులోని కుర్చీలను విరగొట్టారు. పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని దూరంగా పారవేశారు. సంఘటనా స్థలాన్ని సీఐ నబి సందర్శించారు. హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ముస్లిం మతపెద్దలు మీడియాతో మాట్లాడుతూ, బిలాల్ మసీదులో కుర్చీలను విరగ్గొట్టి వస్తువులను చిన్నాభిన్నం చేయడం సహింపరాని విషయమన్నారు. మచిలీపట్నంలో హిందూ, క్రిస్టియన్, ముస్లిం మతాల్లో సమైక్యత ఉందన్నారు. మీడియాతో సంఘ అధికార ప్రతినిధి ఎండీ సద్‌రుద్దీన్ ఖురేషి, అబ్దుల్ రజాక్,ఖయూం, ఎండీ ఆరిఫ్ తదితరులు మాట్లాడారు. ఇందుకు బాధ్యులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

అనుమానాస్పద మృతి

చందర్లపాడు : ముప్పాళ్లలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన నల్లాని వీరమణితేజ(27) బుధవారం చందర్లపాడు, ముప్పాళ్ల గ్రామాల మధ్య సాయంత్రం రోడ్డుపై పడి ఉండటంతో స్థానికులు గుర్తించి అతడి తండ్రి నల్లాని సాయికి తెలిపారు. మృతుడి తలపై బలమైన గాయాలుండటంతో రోడ్డు ప్రమాదమా.. లేక ఎవరైనా దాడి చేసి చంపారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన ముప్పాళ్ల గ్రామంలో కలకలం రేపింది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

హంసలదీవి బీచ్ వద్ద యాత్రికుల సందడి

కోడూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవుల సందర్భంగా హంసలదీవి బీచ్ వద్ద సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులు సందడి చేశారు. సముద్రస్నానాలు ఆచరించి కుటుంబసభ్యులతో సంతోషంగా గడిపారు. మెరైన్ సిబ్బంది లోతైన ప్రాంతానికి వెళ్లొద్దని వారికి సూచించారు. స్నానాల అనంతరం వేణుగోపాలస్వామిని దర్శించుకుని పూజలు చేశారు.





కంకిపాడులో కోడి పందేలు వీక్షిస్తున్న అదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా తదితరులు



ఈడుపుగల్లు కోడి పందేలను ప్రారంభిస్తున్న మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, మాజీ ఎంపీపీ దేవినేని రాజ తదితరులు



ఆకునూరులో పందేలు కాస్తున్న మహిళలు

పందేల హోరు.. జూదం జోరు..

కంకిపాడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబరాలు ముగిశాయి. ఏడాదిగా జూదరులు, పందెం రాయుళ్లు ఈ సంబరాల కోసం ఎదురు చూశారు. అలా వచ్చింది...ఇలా వెళ్లి పోయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి మహిళలు సైతం ఈ కోడి పందేలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చిన్న చిన్న ఘర్షణల మినహా ప్రశాంత వాతావరణంలో కోడి పందేలు ముగిశాయి. మండలంలోని ఈడుపుగల్లు, ఉప్పలూరు, కంకిపాడు (జనసేన), కంకిపాడు (టీడీపీ), గొడవర్రు, నెప్పల్లి గ్రామాల్లో యథేచ్ఛగా కోడి పందేలు, జూదం బరిలు ఏర్పాటు చేశారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోడి పందెం శిబిరానికి తెలంగాణ రాష్ట్రం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కోడి పందేలను ప్రజలతో పాటు ఆసక్తిగా వీక్షించారు.

ఈడుపుగల్లులో ... మండలంలోని ఈడుపుగల్లులో ఏర్పాటు చేసిన కోడి పందెం శిబిరాన్ని మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఉండల్లి శ్రీదేవి సందర్శించారు. బరి అంతటా సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి సంక్రాంతి సంబరాలు అంబరాన్ని



అంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజ, సర్పంచ్ పందిపాటి ఇందిర, టీడీపీ జిల్లా కార్యదర్శి సుధాకర్, షేక్ షకార్ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు బరిలో ఘర్షణ .. మండల కేంద్రమైన కంకిపాడులో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పునాదిపాడు, వణుకూరు గ్రామాలకు చెందిన జూదరులు ఘర్షణకు దిగారు. తోపులాట చోటు చేసుకుంది. నిర్వాహకులు, పోలీసుల రంగ ప్రవేశంతో ఇరువర్గాలను చెదర కొట్టారు.

ఉయ్యూరు : కాటూరు, ఆకునూరులో కోడి పందేలు, పేకాట పెద్దయెత్తున జరిగాయి. కాటూరు పెద్ద బరిలో లక్షల్లో, ఆకునూరులో రూ. 50వేలకు పందేలు కాయగా లక్షల రూపాయలు చేతులు మారాయి. పందేలతో పాటు జూదం, పేకాట, జూద క్రీడాలు భారీగా జరిగాయి. జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి పందేం రాయుళ్లు, పేకాటరాయుళ్లు తరలివచ్చారు. పందేలు తిలకించేందుకు మహిళలు, యువతులు తరలివచ్చి గ్యాలరీలు, బరిల్లో కూర్చుని పందేలు కాశారు. మూడురోజుల పాటు పందేలు, పేకాట రాత్రి పగలు నిర్వహించారు. జూదక్రీడల వద్ద మహిళలు సందడి చేస్తూ పందేలు కాయడం విశేషం.

సుబ్బారాయుడికి వెండి బిందె

మోపిదేవి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి 500 గ్రాముల రూ.55 వేల విలువైన వెండి పూర్ణకుంభం బిందెను చల్లపల్లికి చెందిన కొల్లు చాందిని ఫణిసాయి కరిష్మ బహూకరించారు. కుటుంబసమేతంగా విచ్చేసిన ఆమె స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ పర్యవేక్షకుడు బొప్పన సత్యనారాయణకు బిందెను అందజేశారు. వారిని శేషవస్త్రాలతో సత్కరించి, స్వామి ప్రసాదాలు అందజేశారు.



కలశపూజలో పాల్గొన్న యార్లగడ్డ వెంకట్రావు, దాసరి వెంకట బాలవర్ధనరావు, డాక్టర్ దుట్టా రామచంద్రరావు, చలమలశెట్టి రమేష్‌బాబు



మకరజ్యోతి దర్శనం

కన్నుల పండవగా మకరజ్యోతి దర్శనం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పెరికీడు అయ్యప్పస్వామి దేవస్థానంలో మంగళవారం సంక్రాంతి సందర్భంగా మకర జ్యోతి దర్శనం కన్నుల పండువగా జరిగింది. శబరిమలలో మకరజ్యోతి దర్శనమవుతున్న సమయంలోనే అర్చకులు శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో దేవస్థాన ట్రస్టీ నూలు నరసింహారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలనంతరం ఎమ్మెల్యే యార్లగడ్డ, ట్రస్టీ, డాక్టర్ దుట్టా రామచంద్రరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, వీరమాచనేని సత్యప్రసాద్, కోటగిరి వరప్రసాద్, సుంకర బోస్ తదితర 18మంది భక్తులు, 18కలశాలను పదునెట్టాబండి(18మెట్ల)పై ఉంచి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తుల అయ్యప్ప శరణుఘోష మధ్య ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మకరజ్యోతి వెలిగించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన అయ్యప్ప భక్తుల శరణుఘోషతో పెరికీడు మార్మోగింది. ఈ కార్యక్రమంలో వేగిరెడ్డి పాపారావు, దయాల రాజేశ్వరరావు, దుట్టా శివనారాయణ, బావిరెడ్డి మురళి, తాడి రంగారావు, కొలసాని దుర్గారావు, నండూరి సత్యవెంకటేశ్వరశర్మ, తదితరులు పాల్గొన్నారు.

పాడిపశువులను గౌరవించుకునే పండుగ..కనుమ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి) : రైతులకు వ్యవసాయంలో చేదోడుగా నిలుస్తూ పాడితో ఆర్థికంగా అండగా నిలిచే పశువులను గౌరవించుకునే సంప్రదాయమే కనుమ పండుగని పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్, ఎన్ఎస్పీ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ తెలిపారు. హనుమాన్‌జంక్షన్ పుట్టగుంట ఫామ్‌హౌస్‌లో బుధవారం కనుమ పండుగ సందర్భంగా అర్చకులు రంగనాథ్ ఆధ్వర్యంలో కపిలగోవుకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. కుమారుడు అతీష్, అభయాంజనేయ స్వామి దేవస్థాన మాజీ చైర్మన్ నందిగంస్వామి, వేగిరెడ్డి హరిచక్రవర్తి, వేజెండ్ల ప్రతాప్, తాడి రంగారావు, రాజా తదితరులు ప్రత్యేక పూజలో పాల్గొని గోవుకు అరటిపండ్లు అందజేశారు. రంగన్నగూడెం ఆర్ఆర్‌డీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో గంగిరెద్దు మేళంతో పశువులకు పూజలు నిర్వహించారు. వాటికి గారెలు, అరటిపండ్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఆర్‌డీఎస్ అధ్యక్షుడు తుమ్మల దశరథరామయ్య, ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ, ఎన్నారై కసుకుర్తి దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

ముక్తేశ్వరస్వామి దేవస్థాన అభివృద్ధికి ఎన్నారై విరాళం

పెరికీడు ముక్తి కాంత సమేత ముక్తేశ్వర స్వామి దేవస్థానఅభివృద్ధికి ఎన్నారై బుధవారం విరాళం అందజేశారు. బందరుకు చెందిన పుల్లా సతీష్‌కృష్ణ బంధువులైన చలమలశెట్టి బుచ్చి బాబు ద్వారా రూ.25,116 విరాళాన్ని దేవస్థాన కమిటీకి బుధవారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులతో ప్రత్యేకపూజలు నిర్వహించి స్వామి శేష వస్త్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పుల్లా బాబూ రాజేంద్రవరప్రసాదరావు, జంగాల రమేష్, చలమలశెట్టి బుచ్చిబాబు పాల్గొన్నారు.



రేపటి నుంచి నల్ల మస్తానయ్య ఉరుసు ఉత్సవాలు

గవర్నర్‌పేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నల్లమస్తానయ్య ఉరుసు ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానుండటంతో నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హజరత్ కాలే మస్తాన్ షావలి దర్గా ధర్మకర్త రావి రామ్మోహనరావు తెలిపారు. హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ, ముస్లింలు ఐక్యంగా ఆరాధించే మస్తాన్ బాబా ఉత్సవాలను శుక్రవారం నుంచి 21 వరకు నిర్వహిస్తామన్నారు. చాందిని అలంకరణతో ఉత్సవాలు ప్రారంభమతాయని, అన్నదానం, సందల్ ఊరేగింపు ఉంటుందన్నారు. 18న గంధం పంపిణీ, 19న గ్యార్మీ షరీఫ్, 20న పకీర్లకు చద్దర్లు పంపిణీ నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 21న బాబా ఆశీనులైన కుర్చీని యథాస్థానంలో ఉంచడంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. సమావేశంలో ఉరుసు నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కానూరు కేసీపీ కాలనీలో హరిదాసు కీర్తనలు



ఉయ్యూరులో గంగిరెద్దుల విన్యాసాలు



యనమలకుదురులో ముగ్గుల పోటీలు

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

పెనమలూరు, జనవరి15 (ఆంధ్రజ్యోతి): పెనమలూరు మండలంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. అన్ని గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఎక్కడికక్కడ స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు స్థానిక మహిళలకు ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ నియోజకవర్గ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలను ఉత్సాహపరిచారు. కానూరు కేసీపీ కాలనీలో తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. హరిదాసుల హడావుడి, సంప్రదాయ గంగిరెద్దుల ప్రదర్శనతో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. కంకిపాడు గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ముగ్గుల పోటీలను యార్లగడ్డ సుచిత్ర ప్రారంభించారు.

సీపీఎం ఆధ్వర్యంలో...

యనమలకుదురు గ్రామంలోని తాడిగడప డొంక రోడ్డు, మహాత్మాగాంధీ కాలనీలో సీపీఎం, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి ఆటల పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ పోటీలను మహిళా సంఘం కార్యకర్త లావు అనిత ప్రారంభించారు. పోటీలను ఎస్ఎఫ్ఐ నాయకులు క్రాంతి పర్యవేక్షించారు. సీఐటీయూ నాయకులు షేక్ మస్తాన్‌వలి, షేక్ కాసిం, షేక్‌బాబు, పల్లా చిన్న పాపారావు, లావు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు మండలంలో..

సంక్రాంతి పండుగ ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. వాకిళ్లలో రంగు రంగుల ముగ్గులు, పిండివంటలు, చుట్టాల సందడి, గంగిరెద్దుల విన్యాసాలు,హరిదాసుల కీర్తనలతో మకర సంక్రాంతి, కనుమ పండుగ వేడుకగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ పురస్కరించుకుని పలు చోట్ల ముగ్గులపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. పట్టణాలు నుంచి స్వగ్రామాలకు వచ్చిన వారు పల్లెల్లో బంధువులు, తెలిసిన వారితో సందడిగా గడిపి కోడి పందేలకు వెళ్లారు.

విద్యుత్‌స్తంభాన్ని ఢీకొన్న కారు

యువకుడి మృతి

ఉయ్యూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారు జామున విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో కారు నడుపుతున్న పొట్లూరి శ్రీబాల వంశీకృష్ణ (37)అక్కడికక్కడే మృతి చెందాడు. పోరంకికి చెందిన శ్రీబాల వంశీకృష్ణ హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ సంక్రాంతి పండుగకు వచ్చాడు. స్నేహితుడిని కారులో గుడివాడలో దింపేందుకు వెళ్లి తిరిగివస్తూ ఉయ్యూరు ఫ్లైఓవర్ సమీపాన కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఉయ్యూరు పట్టణ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు శ్రీబాల వంశీకృష్ణ(ఫైల్ ఫొటో)

చికిత్స పొందుతూ మృతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. హనుమాన్‌జంక్షన్ ఎస్సై2 మూర్తి వివరాల ప్రకారం.. బాపులపాడులోని ఇందిరానగర్‌లో నివసిస్తున్న తోట వెంకట రామకృష్ణ(43) కుమారుడిని కోడిపందేలు చూపించేందుకు బైక్‌పై తీసుకువెళుతుండగా హనుమాన్‌జంక్షన్‌బైపాస్‌లో కె.సీతారాంపురం వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. బైక్‌లు నడుపుతున్న ఇద్దరు గాయపడగా, వెనుక కూర్చున్న రామకృష్ణ కుమారుడికి చిన్నపాటి గాయాలయ్యాయి. రామకృష్ణను విజయవాడ ఆసుపత్రికి తరలించి వైద్యచికిత్స అందిస్తుండగా మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం బంధువులకు అప్పగించామని, మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై2 మూర్తి తెలిపారు.

రైతుల సమస్యలపై ధర్నా రేపు

• రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి

గుడివాడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారం కోరు తూ ఈ నెల 17న విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగే ధర్నాను విజయవంతం చే యాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక కామ్రేడ్ సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రయ్య డ్రైన్ ముంపు నివారణకు చర్యలు చే పట్టాలని, బీమా పరిహారం చెల్లించాలని, అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 20వేలు వెంటనే ఇవ్వాలని, విద్యుత్ మీటర్లను ఉపసంహరించుకోవాలని, రెవెన్యూ సదస్సులోని అర్జీలను వెంటనే పరిష్కరించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కృష్ణా-గోదావరి డెల్టా పంట కాలువలు, డ్రైనేజీలను ఆధునీకరించాలని వంటి సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నాకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. రైతులు వేలాదిగా పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని గౌరిశెట్టి పిలుపునిచ్చారు. నేతలు మురళీకృష్ణారెడ్డి, శొంఠి ఉమామహేశ్వరరావు, నాగినేని వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

త్రిపురనేని వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

అభ్యుదయ రచయితల సంఘం, త్రిపురనేని స్మారక కమిటీ ప్రతినిధులు

వన్‌టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ హేతువాద రచయిత, త్రిపురనేని రామస్వామి వర్ధంతిని అధికారికంగా నిర్వహించా లని అభ్యుదయ రచయితల సంఘం, త్రిపురనేని స్మారక కమిటీ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. త్రిపురనేని రామస్వామి జయంతి సందర్భంగా బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలో ఆయన విగ్రహానికి సంఘ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ సమాజాన్ని తప్పుదోవ పట్టించే మూఢ విశ్వాసాల నుంచి ప్రజలను మేల్కొలిపి మెరుగైన మార్గం వైపు మళ్లించటమే హేతువాద ఉద్యమమన్నారు. త్రిపురనేని తన ఇంటిని సాహిత్య కేంద్రంగా మార్చారన్నారు. త్రిపురనేని కుటుంబ సభ్యుడు పొట్లూరి పూర్ణేందు మౌళి మాట్లాడుతూ రామస్వామి కుటుంబ నేపథ్యం, జీవిత విశేషాలను వివరించారు. నాస్తిక సమాజం కార్యదర్శి కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 8,9 తేదీలలో మంగళగిరి చార్వాక ఆశ్రమంలో నాస్తిక మేళా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చియ్య, ఆయా కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి వెండి బిందె బహూకరణ

మోపిదేవి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి 500 గ్రాముల రూ.55 వేల విలువైన వెండి పూర్ణ కుంభం బిందెను చల్లపల్లికి చెందిన కొల్లు చాందిని ఫణిసాయి కరిష్మ బహూకరించారు. కుటుంబసమేతంగా విచ్చేసిన ఆమె స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ పర్యవేక్షకుడు బొప్పన సత్యనారాయణకు బిందెను అందజేశారు. వారిని శేషవస్త్రాలతో సత్కరించి, స్వామి ప్రసాదాలు అందజేశారు.



పూర్ణకుంభం బిందెను ఆలయ ఉద్యోగులకు అందిస్తున్న దాతలు



బైక్ నుంచి ఊడి దూరంగా పడిన టైరు, ముందు భాగం దెబ్బతిన్న కారు

కారు - బైక్ ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

● మరొకరికి స్వల్పగాయాలు..ఆస్పత్రికి తరలింపు

మోపిదేవి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న కారు- బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రంగా, మరొకరికి స్వల్పంగా గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం నుజ్జయ్యింది. ఈ ఘటన పెదప్రోలు పంచాయతీ శివారు కప్తానుపాలెం వద్ద 216 జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగింది. చల్లపల్లి వైపు నుంచి అవనిగడ్డకు వెళ్తున్న మహీంద్రా కారు.. మోపిదేవి నుంచి చల్లపల్లి వైపు వెళ్తున్న బైక్ ఎదురెదురుగా వచ్చి బలంగా ఢీకొట్టుకున్నాయి. ద్విచక్రవాహనం ముందు చక్రం ఊడిపోయింది. ఇంజన్‌తో సహా దూరంగా పడింది. బైక్‌పై ఉన్న పెదప్రోలుకు చెందిన కొక్కిలిగడ్డ రాజేష్, నాగేశ్వరరావు గాలిలో ఎగిరి వెనుక వస్తున్న శివరామపురానికి చెందిన వేములపల్లి శివప్రసాద్ బైక్‌పై పడ్డారు. దీంతో కొక్కిలిగడ్డ రాజేష్, వేములపల్లి శివప్రసాద్‌కు కాళ్లు, చేతులు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. నాగేశ్వరరావు స్వల్పంగా గాయపడ్డాడు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారంతో 108 అంబులెన్స్‌లో అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. కారు ముందు భాగం దెబ్బతిన్నది. ద్విచక్ర వాహనం ముందు భాగం పూర్తిగా విరిగి దూరంగా పడటంతో భారీ శబ్దం వచ్చి, సమీప గృహాల ప్రజలు భయపడ్డారు. ఎస్సై సత్యనారాయణ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.



బంటుమిల్లిలో..



వెలివోలులో..



పెదప్రోలు శివారులో..

బరుల వద్ద కోలాహలం

● మూడు రోజులు నిరాటంకంగా కొనసాగిన కోడిపందేలు, జూదం

సంక్రాంతిని పురస్కరించుకుని మూడురోజుల పాటు కోడి పందేలు, జూదం జోరుగా సాగాయి. పోలీసులు పట్టనట్టు వ్యవహరించడంతో నగదు భారీగా చేతులు మారింది. కోడి పందేలు తిలకించ డానికి భారీ సంఖ్యలో తరలిరావడంతో బరుల వద్ద కోలాహలం నెలకొంది.



వెలివోలులో కాలు దువ్వుతున్న పుంజులు



జక్కంచర్లలో..

మచిలీపట్నం టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బందరు మండలం రుద్రవరం, మేకావారిపాలెం, తపసిపూడి, మంగినపూడి గ్రామాల్లో మూడోరోజు బుధవారం కూడా కోడిపందేలు, పేకాట, జూదం కొనసాగాయి. జూదరులు వాహనాలపై పెద్ద సంఖ్యలో బరుల వద్దకు వచ్చి జూదం ఆడారు. రూ.లక్షలు చేతులు మారాయి. పేకాటలో డబ్బు పోగొట్టుకున్నవారు లబోదిబోమంటూ వెళ్లారు. బరుల వద్ద మద్యం ఏరులై పారింది. కొన్నిచోట్ల యువకులు ఘర్షణకు దిగారు.

చేతులు మారిన రూ.లక్షలు

బంటుమిల్లి: మండలంలో కోడిపందేలు, జూదం జోరుగా సాగాయి. లక్షలాది రూపాయలు చేతులు మారాయి. చిన్న బరికి రూ.లక్ష నుంచి, పెద్ద బరికి రూ.3 లక్షల వరకు నిర్వాహకులు చెల్లింపులు చేసినట్లు తెలుస్తోంది. రాత్రింబవళ్లు కోసు, పేకాట విద్యుత్ దీపాల వెలుగులో నిర్వహించారు. మద్యం ఏరులై పారింది. కొన్ని బరుల వద్ద ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు పోయాయని పందేలు చూడడానికి వచ్చిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ వెంచర్‌లో బరి..

మోపిదేవి: మూడురోజులపాటు కోడిపందేలు, జూదక్రీడలు కొనసాగాయి. పెదప్రోలు పంచాయతీ శివారులోని ఓ ప్రైవేట్ వెంచర్‌లో భారీగా కోడిపందేలు, గుండాట, చిత్తులాట నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా పందెపురాయుళ్లు తరలివచ్చారు.

వెలివోలులో భారీగా..

చల్లపల్లి: వెలివోలులో కోడిపందేలు, జూదాలు జోరుగా సాగాయి. వెలివోలు వంతెన దాటిన తర్వాత కరకట్ట దిగువన బరుల్లో సోమవారమే పందేలు ప్రారంభమయ్యాయి. బుధవారం వరకూ కొనసాగాయి. జూదక్రీడలు కూడా నిర్వహించడంతో ఆ ప్రాంతం పందెంరాయుళ్లు, జూదరులతో సందడిగా మారింది. పేకాట, చిత్తులాట, లోనాబయటా నిర్వహించారు.

రాత్రీపగలు తేడా లేకుండా..

పెడన: మూడు రోజుల పాటు పట్టణంలో రాత్రీపగలు తేడా లేకుండా కోడి పందేలు, పేకాటలు నిర్వహించారు. పట్టణంలోని పల్లోటి స్కూల్ వెనుక, తహసీల్దార్ కార్యాలయం సమీపంలో పెద్ద బరులు ఏర్పాటు చేసి కోడి పందేలు, పేకాటలు నిర్వహించారు. పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. భోగి రోజు ఉదయం ప్రారంభమైన కోడి పందేలు, పేకాటలు కనుమరోజైన బుధవారం సాయంత్రంతో నిలిచిపోయాయి. కనుమ రోజు కావడంతో బుధవారం పట్టణంలో చేపలు, మాంసం దుకాణాలు కిటకిటలాడాయి.

గూడూరు, జక్కంచర్ల, రామన్నపేటలో..

గూడూరు: గూడూరు, జక్కంచర్ల, రామన్నపేటలో కోడిపందేలు భారీగా నిర్వహించారు. మహిళలు సైతం కోడి పందేలు తిలకించేందుకు రావడం విశేషం. పలు చోట్ల పేకాట శిబిరాలు నిర్వహించారు.



అపూర్వ సమ్మేళనం

గోగినేనిపాలెం హైస్కూల్ 1983-88 బ్యాచ్

ఘంటసాల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): గోగినేనిపాలెం జడ్పీ పాఠశాల 1983-88 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం జరిగింది. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు పాఠశాలలో సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఆప్యాయంగా పలకరించారు. తాము చదివిన తరగతి గదులను కలియతిరిగి ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులను ఘనంగా సత్కరించారు.

సంప్రదాయబద్ధంగా సంక్రాంతి సంబరాలు

నాగాయలంక, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్‌లోని వేదికపై మంగళవారం రాత్రి దివంగత మండవ వెంకట్రామయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు నేతృత్వంలో భోగిమంటలను వేశారు. నటరాజ్ డాన్స్ అకాడమీ కళాకారులు జనపద, సాంఘిక నృత్యాలను ప్రదర్శించారు.



నృత్యప్రదర్శన చేస్తున్న నృత్యకారులు

ప్రకృతి ఫొటోల పోటీల్లో విజేతలకు బహుమతులు

శ్రీరామపాదక్షేత్రం వద్ద సెల్‌ఫోన్ ఉపయోగించి ప్రకృతిని ఫొటోలు తీసే పోటీలను దివంగత మండవ వెంకట్రామయ్య చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించింది. 21 మంది ఫొటోలు తీసి పంపారు. తూనుగుంట్ల హేమ(ప్రథమ), విస్సంశెట్టి సుకన్య(ద్వితీయ), టి.శేషుకుమార్(తృతీయ) స్థానాల్లో నిలిచారు. న్యాయనిర్ణేతగా చన్నగిరి లతామోహన్ వ్యవహరించారు. సింహాద్రి కృష్ణప్రసాద్, తలశిల రఘుశేఖర్ పర్యవేక్షించారు. మండవ బాలవర్ధిరావు, ఉప్పల లీలాకృష్ణప్రసాద్ విజేతలకు బహుమతులను అందజేశారు.

హంసలదీవి బీచ్ వద్ద యాత్రికుల సందడి

కోడూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవుల సందర్భంగా హంసలదీవి బీచ్ వద్ద సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులు సందడి చేశారు. సముద్రస్నానాలు ఆచరించి కుటుంబసభ్యులతో సంతోషంగా గడిపారు. మెరైన్ సిబ్బంది లోతైన ప్రాంతానికి వెళ్లొద్దని వారికి సూచించారు. స్నానాల అనంతరం వేణుగోపాలస్వామిని దర్శించుకుని పూజలు చేశారు.



హంసలదీవి బీచ్‌లో యాత్రికులు

ఆకట్టుకున్న సంగీత విభావరి



సంగీత విభావరికి విచ్చేసిన ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి ప్రధాన పార్కులో సునీల్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. సినీ భక్తిగీతాలను కళాకారులు సునీల్‌తో పాటు నాయక్, రాజా, సింధు, మహేశ్వరి ఆలపించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అతిథులుగా పాల్గొన్నారు. కళాకారులను ఆర్టీసీ చైర్మన్ సత్కరించారు. మచిలీపట్నం ప్రధాన పార్కులోని కళావేదికను అభివృద్ధి చేస్తే ప్రతి ఆదివారం వినోద, విజ్ఞాన కార్యక్రమాలు, యోగా ప్రదర్శనల నిర్వహణకు ఉపయోగపడుతుందని కళాకారులు వారిని కోరారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, టీడీపీ నాయకుడు జలీల్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

● టీడీపీ నేతలు, కార్యకర్తలకు గోపీచంద్ సూచన

మచిలీపట్నం టౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక అమలు చేసిన సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ సూచించారు. టీడీపీ సభ్యత్వ నమోదులో 45వ డివిజన్ రెండవ ర్యాంకులో నిలవడంతో బూత్ కన్వీనర్ బత్తిన అగస్త్యేశ్వరరావును బుధవారం గొర్రెపాటి గోపీచంద్ సత్కరించారు. 'కూటమి ప్రభుత్వమొచ్చాక పింఛన్ రూ.4వేలకు పెంచింది. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసింది. గోతులమయమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టింది. నాసిరకం మద్యం బ్రాండ్లను నిలిపివేసింది. ఉద్యోగులు, కాంట్రాక్టర్లకు ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లిస్తోంది. చెత్తపన్ను రద్దు చేసింది. ఉచిత గ్యాస్‌ను అందజేస్తోంది. అన్న క్యాంటీన్లు పునరుద్ధరించింది. త్వరలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనుంది.' అని గోపీచంద్ పేర్కొన్నారు. 45వ డివిజన్ ఇన్‌ఛార్జి పి.వి.ఫణికుమార్, ఐ.దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీతకు ముగ్గుల పోటీలు దోహదం

ముగ్గులు తిలకించిన మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్: ఐదు రోడ్ల సెంటర్‌లో బుధవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. రంగవల్లులు తిలకించారు. ముగ్గులువేసిన మహిళలను అభినందించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ కార్పొరేటర్లు దింటకుర్తి సుధాకర్, అన్నం ఆనంద్ పాల్గొన్నారు.



గూడూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మహిళల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ముగ్గుల పోటీలు దోహదపడతాయని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. గూడూరు గాంధీబొమ్మ సెంటర్‌లో పోతన స్వామి ఆధ్వర్యంలో మూడు రోజులుగా వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. చివరి రోజైన బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వమించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే విచ్చేశారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. డీసీ చైర్మన్ పోతన స్వామి, అన్నం హరిరామకృష్ణ, ఎస్‌ఏ బేగ్, సర్పంచ్ లింగం సులోచనారాణి, జనసేన నాయకుడు పోతన రామోజీ, బీజేపీ నేత కోలపల్లి రజని పాల్గొన్నారు.



గాంధీబొమ్మ సెంటర్‌లో ముగ్గులను తిలకిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

అగ్నిప్రమాద బాధితులకు సాయం

చల్లపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మంగళాపురంలో జడ్పీ హైస్కూల్ వెనుక ఇటీవల గొరిపర్తి శ్రీనివాసరావు-సుబ్బరావమ్మ ఉండే పూరిల్లు అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. బుధవారం రెడ్‌క్రాస్ జిల్లా శాఖ సహకారంతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చల్లపల్లి సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో వంటపాత్రలు, హెవీ టార్పాలిన్, బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ సహకారంతో సమితిసభ్యులు చీరలు, దుప్పట్లు, లుంగీలు అందజేశారు. నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, తూము వెంకటేశ్వరరావు, ఘంటసాల కృష్ణమోహన్ పాల్గొన్నారు.

చలమలశెట్టి చారిటబుల్ ట్రస్టు సాయం

మచిలీపట్నం టౌన్: బందరుకోటలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన వాసాల శ్రీనివాస్ కుటుంబానికి చలమలశెట్టి చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు సాయం అందించారు. నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి, దుస్తులు అందచేశారు. ట్రస్టు మేనేజర్ చలమలశెట్టి పాండురంగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాస్టర్ ఐజాక్ శామ్యూల్, రాజీవ్, రహమాన్ పాల్గొన్నారు.

సుందర బందరు ప్రారంభం

మచిలీపట్నం టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సుందర బందరు కార్యక్రమం నగరంలో ప్రారంభమైంది. అక్టోబరు 2న సీఎం చంద్రబాబునాయుడు వచ్చినప్పుడు మెయిన్‌రోడ్డు డివైడర్లపై సప్తవర్ణాల డిజైన్లు గీసే కార్యక్రమాన్ని ప్రారంభించి, స్వయంగా కుంచెతో డిజైన్లు గీశారు. మూడు నెలల తర్వాత నగరపాలక సంస్థ డివైడర్లపై డిజైన్లు గీసే కార్యక్రమాన్ని ప్రారంభించింది. పంపుల చెరువు వద్ద మంత్రి కొల్లు రవీంద్ర సారథ్యంలో జంగిల్‌క్లియరెన్స్ చేశారు. సీఎం చంద్రబాబుపై గౌరవంతో ఆయన గీసిన డిజైన్లను కళాకారులు అలాగే ఉంచి మిగిలిన స్థలంలో డిజైన్లు వేశారు. వి లవ్ అవర్ సిటీ అనే నినాదాన్ని రాశారు. నగరాన్ని ప్రేమిద్దాం, సుందరంగా తీర్చిదిద్దుదాం నినాదంతో గీసిన డిజైన్లు ఆకట్టుకుంటున్నాయి. కోనేరుసెంటర్ నుంచి జడ్పీ సెంటర్ వరకు డివైడర్లకు ఇరుపక్కలా డిజైన్లు గీస్తున్నారు. కమిషనర్ బాపిరాజు పర్యవేక్షించారు.



మెయిన్‌రోడ్డులోని డివైడర్‌పై సప్తవర్ణాలతో ఇంద్రధనస్సు, వి లవ్ అవర్ సిటీ నినాదం

వృద్ధులకు అన్నదానం

చల్లపల్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్త కోనేరు వెంకట్రామయ్య చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కోనేరు మారుతీప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన మిత్రులు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, మిత్ర బృందం స్థానిక సీయోను అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. చల్లపల్లి డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, తొట్టెంపూడి మల్లి, అంబటి భువనేశ్వరరావు, బుల్లా కిషోర్ పాల్గొన్నారు. నాని మేనకోడళ్ల ఆశ్రమ నిర్వహణకు రూ.5వేలు వితరణగా అందించారు.

నేత్రపర్వంగా మకరజ్యోతి

చల్లపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మకర సంక్రాంతి సందర్భంగా అయ్యప్ప స్వామి దేవాలయాల్లో మకరజ్యోతి కార్యక్రమాలు నేత్రపర్వంగా నిర్వహించారు. శబరిమలలో మకరజ్యోతి దర్శనం నిర్వహించే సమయంలో స్థానికంగా ఆలయాల్లోనూ కర్పూర జ్యోతిలను వెలగించారు. నిమ్మలతోటలోని హరిహరపుత్ర అయ్యప్పస్వామి క్షేత్రంలో ఆలయ వ్యవస్థాపకుడు అన్నవరపు పాండురంగారావు గురుస్వామి దంపతులు మకరజ్యోతి సందర్భంగా కర్పూరజ్యోతిని వెలిగించారు. భక్తులు భారీ సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



నిమ్మలతోట, ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయాల్లో దేదీప్యమానంగా వెలుగుతున్న జ్యోతులు

స్వామి నగల ఊరేగింపు



నగలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళుతున్న ధర్మకర్త భావన్నారాయణ

కోడూరు: అయ్యప్పస్వామి దేవాలయ 21వ మకర జ్యోతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బడే భావన్నారాయణ ఇంటి నుంచి డప్పు వాయిద్యాల నడుమ అయ్యప్ప నామ సంకీర్తనతో స్వామి నగలను ఊరేగింపుగా దేవాలయానికి తీసుకొచ్చి స్వామికి అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో జ్యోతి దర్శనం, మాలికాపురత్తమ్మతో అయ్యప్ప స్వామి కల్యాణ రాయబార కార్యక్రమం నిర్వహించారు. స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

ఐద్వా సంక్రాంతి సంబరాలు

గుడివాడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో వాంబే కాలనీలో మంగళవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. బాలబాలికలకు పలు రకాలు పోటీలను నిర్వహించి గెలపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఐద్వా కార్యదర్శి పి.రజిని, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రేపాని కొండ, స్థానికులు పాల్గొన్నారు.



లెమన్ అండ్ స్పూన్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

ఘనంగా సంక్రాంతి

గుడివాడ రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే సంక్రాంతి శోభ గ్రామాల్లో వెల్లివిరిసింది. ప్రతి ఇంటి ముందు యువతులు రంగవల్లులు వేసి ఒకరికొకరు సంక్రాంతి సంబరాలు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి పండుగ జరుపుకున్నారు. కనుమ రోజున పశువులను చక్కగా కడిగి వాటికి పసుపు, కుంకుమ చల్లి పూజలు నిర్వహించారు. మండలంలోని 21 గ్రామాల్లో సంక్రాంతి, కనుమ పండుగలను ఈ ఏడాది భారీగా నిర్వహించారు.







వేమవరంలో విజేతకు బుల్లెట్ అందజేస్తున్న గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, యాక్టివా సాధించిన హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ బృందం విజయకేతనం చూపిస్తూ.. పందెంకోళ్లతో అఖండ పాటల, మాటల రచయిత త్రిపురనేని కళ్యాణచక్రవర్తి



గడ్డివాము దగ్ధం..

● పట్టించుకోని పోలీసులు

నందివాడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోలుకొండలో చంద్రయ్య కాలువ వద్ద పశువుల మేత కోసం ఉంచిన సుమారు 15 ఎకరాల గడ్డివాముకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. వారం క్రితం కూడా ఇదే పరిస్థితి. ఎవరికీ ఏం చెప్పుకోలేక అయోమయ పరిస్థితిలో పటాకుల రంగారావు. పశువులను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. వాటి మేత కోసం పదెకరాల్లో గడ్డిని కొని ఇంటి వద్ద ఖాళీ లేకపోవటంతో చంద్రయ్య కాలువ గట్టుపై వామిలా పెట్టుకుంటే నిత్యం జనం తిరుగుతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని యజమాని రంగారావు తెలిపారు. వారం క్రితం వరిగడ్డివామి దగ్ధమైందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని బాధితుడు వాపోయాడు.

యథేచ్ఛగా కోడిపందేలు.. కిక్కిరిసిన బరులు

● తరలివచ్చిన మహిళలు, యువతులు ● విజేతలకు ఎన్‌ఫీల్డ్ బైకులు ● పుంజుల మాంసానికి గిరాకీ

గుడ్లవల్లేరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్రాంతి, కనుమ పండుగలు ప్రజలు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. కోడిపందేల జోరుగా జరిగాయి. యువత, చిన్నపెద్దలు తేడా లేకుండా కోడిపందాల బరుల్లోకి క్యూకట్టారు. ఏ కారు చూసినా, ఏ మోటార్ బైక్ వెళ్లినా అన్నీ బరుల బాట పట్టాయి. రోడ్లన్నీ వాహనాల రాకపోకలతో కిక్కిరిశాయి. మహిళలు, యవతులు పెద్దసంఖ్యలో పందేలకు వచ్చారు. కొందరు కోడిపందేలు చూసి ఆనందిస్తే, మరికొందరు పందేలు వేసి బానే లాగేశారు. లల్లాయి గుండు, ముడుముక్కలు, 52 ముక్కలాట, లోనా బయటా పెద్దసంఖ్యలో ఆడగా రూ.లక్షల్లో చేతులు మారాయి. మండలంలోని వేమవరం, కూరాడ, డోకిపర్రు,గుడ్లవల్లేరు, కుచికాయిలపూడిలో బరులు నిర్వహించారు. మండలంలో జూదాలు కానీ, కోడి పందేలు కానీ ఏదైనా రూ.కోట్లలో టర్నోవర్ జరిగిందని సమాచారం. ఆయా బరులను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సందర్శించి పందేలు తిలకించారు. వేమవరంలో పందెంలో గెలిచిన వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా బుల్లెట్ వాహనాన్ని అందజేశారు. యాక్టివా పందేల్లో రెండు యాక్టివాలను హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్, కిషోర్, సురేంద్రరెడ్డి బృందం సాధించారు. కుచికాయిలపూడి బరిని అఖండ ఫేమ్ పాటల, మాటల రచయిత త్రిపురనేని కళ్యాణ చక్రవర్తి సందర్శించారు.

మొవ్వ మండలంలో..

కూచిపూడి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ మొవ్వ మండలంలో మూడు రోజులపాటు కోడిపందేలు, జూదక్రీడలు యథేచ్ఛగా సాగాయి. దారులన్నీ బరుల వైపే అన్నట్టు సాగాయి. కూచిపూడి, పెదపూడి, కోసూరు, పెదముత్తేవి గ్రామాల్లో పందేలు నిర్వహించారు. పందెం రాయుళ్లతో బరులు కిక్కిరిసాయి. కోడిపందేలతో పాటు పేకాట, గుండాట, చిత్తులాట, కాయ్ రాజా కాయ్ వంటి క్రీడల్లో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. ఎక్కువ పందేలు గెలిచిన వారు ఎన్ ఫీల్డ్‌తోపాటు ఇతర ఖరీదైన బైకులు కానుకలుగా అందుకున్నారు. ఫ్లడ్ లైట్ల వెలుతురుల్లోనూ పందేలు జరిగాయి. ఉభయ కృష్ణాజిల్లాలతోపాటు ఉభయ గోదావరి, గుంటూరు జిల్లాల నుంచి పందెపురాయుళ్లు తరలివచ్చారు. ప్రవాస భారతీయులతోపాటు మహిళలు సైతం పందేలు తిలకించేందుకు ఆసక్తి కనబర్చారు. బరుల వద్ద పందెం పుంజుల మాంసానికి గిరాకీ ఏర్పడింది. బరుల బయట కిలో రూ.1000కి మాంసం విక్రయించారు. పందెం పుంజుల మాసం అంటూ జరిపిన విక్రయాల్లో బ్రాయిలర్ కోళ్ల మాసం సైతం విక్రయించి సొమ్ము చేసుకున్నారు. మండలంలో పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు, ఇతర క్రీడలు నిర్వహించారు. కనుమ రోజు మాంసాహారం భుజించటం ఆనవాయితీగా వస్తుండటంతో మాంసానికి గిరాకీ పెరిగి రూ.800 ఖరీదు ఉన్న వేట మాంసాన్ని రూ.1000లకు విక్రయాలు జరిపారు.



గరికపర్రులో జనంతో కిక్కిరిసిన కోడిపందేల బరి



గరికపర్రు బరిలో పుంజులకు కత్తి కడుతున్న పందెం నిర్వాహకులు

పమిడిముక్కల మండలంలో..

పమిడిముక్కల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోడిపందేలు పెద్ద ఎత్తున జరిగాయి. భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులపాటు కోడి పందేలు, చిన్న బజార్, పెద్ద బజార్, పేకాట భారీగా నిర్వహించారు. కపిలేశ్వరపురంలో టీడీపీ నేతలు తాతినేని రమేశ్, తాతినేని సాయిదత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. కోడిపందేల బరిలో ఒకేసారి ఐదు కోడి పుంజులతో రింగ్ పందెం నిర్వహించారు. పందేలకు, తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి తరలివచ్చారు. హనుమంతపురంలో లింగంనేని బాబూరావు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కోడి పందేలు, ఇతర క్రీడలు పెద్ద ఎత్తున్న నిర్వహించారు.

గరికపర్రులో..

తోట్లవల్లూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా గత మూడు రోజుల పాటు కోడిపందేలు, పేకాట జూదాలు జోరుగా జరిగాయి. గరికపర్రు, కుమ్మమూరు, తోట్లవల్లూరు, వల్లూరుపాలెం గ్రామాల్లో బరులు ఏర్పాటు చేయగా గరికపర్రు, తోట్లవల్లూరులో జోరుగా సాగాయి. జనం పోటెత్తటంతో గరికపర్రు బరి ఒక జాతరను తలపించింది. కోడిపందేలతో పాటు కోతముక్క, లోనా బయట జూదాలు కొనసాగాయి. ఈ పందేలకు పురుషులతో పాటు మహిళలు సైతం సందడిగా తరలి వచ్చారు. జూదంతో లక్షల్లో డబ్బులు చేతులు మారాయి. తోట్లవల్లూరు బరిలో కానిస్టేబుల్ కోతముక్క ఆడి రూ.5లక్షల వరకు గెలుచుకున్నట్టు ప్రచారం జరిగింది. పోలీసులు ఎంత నియంత్రించినా పందెంకోళ్లే గెలిచాయి.







కూచిపూడిలో పుంజులను ఉసిగొల్పుతున్న పందెపు రాయుళ్లు, కపిలేశ్వరపురంలో రింగ్ పందెంలో ఒకేసారి తలపడుతున్న కోడిపుంజులు, బరి వద్ద టీడీపీ నేతల కటౌట్లు

నెంబరు ప్లేట్లు లేకుండా
వాహనాలు నడిపితే చర్యలు

● వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్



గుడివాడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వాహనాలకు వెనుక, ముందు నెంబరు ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనదారులపై చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి ప్రజల్లో, వాహనదారుల్లో చైతన్యం తెచ్చేందుకు కృషి చేస్తున్నాయని, సీసీ కెమెరాలను అమర్చి నేరాల నియంత్రణకు కట్టుబడి ఉన్నామన్నారు. కొంతమంది మోటారు వాహనాల చట్టం చలానాలు, పోలీసులు తీసే ఫొటోల నుంచి తప్పించుకునేందుకు నెంబరు ప్లేటు లేకుండా వాహనాలను నడుపుతున్నారని, దీన్ని అవకాశంగా తీసుకుని పెద్ద నేరాలు చేసే నేరస్థులు పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నారన్నారు. వాహనాలకు ప్రభుత్వం జారీచేసిన నెంబరు ప్లేట్లను అమర్చుకోవాలని సీఐ కోరారు.

కవిరాజు త్రిపురనేనికి ఘన నివాళి



గుడ్లవల్లేరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతిని అంగలూరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి గ్రామ సర్పంచ్ మేడేపల్లి రవికుమార్, ఉప సర్పంచ్ సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా గురువారం ఆయన వర్ధంతిని కూడా నిర్వహిస్తున్నట్టు సురేష్ తెలిపారు.

రైతుల సమస్యలపై రేపు ధర్నా

● రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి

గుడివాడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 17న విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక కామ్రేడ్ సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రయ్య డ్రైన్ ముంపు నివారణకు చర్యలు చేపట్టాలని, బీమా పరిహారం చెల్లించాలని, అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు వెంటనే ఇవ్వాలని, విద్యుత్ మీటర్లను ఉపసంహరించుకోవాలని, రెవెన్యూ సదస్సులోని అర్జీలను వెంటనే పరిష్కరించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కృష్ణా-గోదావరి డెల్టా పంట కాలువలు, డ్రైనేజీలను ఆధునీకరించాలని వంటి సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నాకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. రైతులు వేలాదిగా పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని గౌరిశెట్టి పిలుపునిచ్చారు. నేతలు మురళీకృష్ణారెడ్డి, శౌంరి ఉమామహేశ్వరరావు, నాగినేని వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



మంటాడ- లంకపల్లి ఆర్ అండ్ బీ రోడ్డు పక్క, కపిలేశ్వపురం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద తగలబెట్టిన చెత్త నుంచి వస్తున్న పొగ

రోడ్డుపైనే చెత్త డంప్‌నకు నిప్పు

కపిలేశ్వరపురం-మంటాడ పరిధిలో పొగచూరుకుంటున్న రోడ్లు

పమిడిముక్కల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మంటాడ-లంకపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన చెత్త డపింగ్ చేసి తగలబెడుతుంటే దట్టంగా పొగ కమ్మి వాహనాలు నడిపేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. మంటాడ రెడ్డి పాలెం, తాడంకి, కపిలేశ్వరపురంలో శుభ్రపరచిన చెత్తతో పాటు పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న వారు చెత్త తీసు కువచ్చి పోయడంతో ఆ ప్రాంతంలో చెత్త కుప్పలు పేరుకుని డంపింగ్ యార్డుగా మారింది. దీంతో పంచాయతీ కార్మికులు అక్కడే తగల పెడుతున్నారు. కాలుతున్న చెత్త నుంచి రోజుల తరబడి పొగ లేచి రోడ్లను కమ్ముకుంటున్నారు. దీంతో ద్విచక్రవాహనాలపై వెళ్లేవారికి రోడ్డు సక్రమంగా కన్పించక ప్రమాదానికి గురవుతున్నారు. కపిలేశ్వరం వద్ద ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా ఉండటంతో పక్కనే చెత్తడంపింగ్ చేసి కాల్చివేస్తున్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు



పామర్రు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారింటా పెద్ద పండుగైన సంక్రాంతి పర్వదినాన్ని మంగళవారం మండల పరిధిలోని ప్రతి ఇంటా ఎంతో ఘనంగా జరుపుకున్నారు. కొత్త అల్లుళ్లతో గ్రామాల్లోని వాకిళ్లు రంగురంగుల రంగవల్లులతో కళకళాలాడాయి. నూతన వస్త్రాలు ధరించి, చిన్న పెద్ద భేదాలు విడనాడి రంగు రంగుల గాలి పటాలు ఆకాశంలోకి ఎగురవేసి సందడి చేశారు. అన్నదాతలకు తమ కష్టాల్లో చేదోడు వాదోడుగా ఉండే పశుసంతతికి రైతులు బుధవారం వేడినీళ్ల స్నానాలు చేయించి పసుపు, కుంకమలతో ప్రత్యేకంగా ఆలంకరించి ప్రతి ఏడాది మాదిరిగానే ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. పితృదేవతలకు పూజలు జరిపి వారి పేరుతో పలువురికి నూతన వస్త్రాలు బహుకరించారు.